



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 16-04-2024 | సంపుటి : 06 | సంచిక : 215 | పేజీలు : 8 | వెల : రూ 3-00



# ఆదరణ చూసి ఓర్వలేక దాడులు

**ప్రజాశీర్వాదంతో ప్రాణాలతో బయటపడ్డా**
**ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు**
**మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే**
**ఒకరోజు విశ్రాంతి తరవాత బస్సుయాత్ర ప్రారంభం**
**కేసరపల్లి వద్ద ఆతర ప్రారంభించిన జగన్**
**భారీగా తరలి వచ్చి పరామర్శించిన నేతలు**

విజయవాడ,ఏప్రిల్15 : బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూసే దాడులు చేస్తున్నారని,రాయి దాడి ఘటనపై సీఎం జగన్ తొలిసారి స్పందించారు. విజయవాడ సమీపంలోని కేసరపల్లి వద్ద తనను కలిసిన కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూసే దాడులు చేస్తున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రాణాపాయం తప్పిందని, మరోసారి అధికారంలోకి వస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. తనను ఎలాంటి దాడులు ఆపలేవన్నారు. ప్రజల మద్దతుతో మరింత ముందుకెళ్తానన్నారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని జగన్ చెప్పారు. ధైర్యంతో ముందడుగు వేద్దామని కార్యకర్తలతో పేర్కొన్నారు. దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం తమకు ఉన్నాయన్నారు. ప్రజల ఆశీస్సులతోనే దాడి నుంచి తప్పించుకోగలిగానని తెలిపారు. ఒకరోజు విరామం తరువాత సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రను కొనసాగించారు. నవరత్న పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ న్యాయం జరిగిందనీ, ప్రజల ఆశీర్వాదం ఉన్నాయని, ధైర్యంగా అడుగులు ముందుకేద్దామని వైసిపి అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అన్నారు. విజయవాడలో రాయి దాడి తర్వాత డాక్టర్ల సూచనతో ఒకరోజు విశ్రాంతి తర్వాత బస్సు యాత్రను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. గాయమైన జగన్‌ను పరామర్శించేందుకు కేసరపల్లి క్యాంపునకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిపై హత్యాయత్నం ఘటనపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు. వైసిపి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, బస్సు యాత్రకు వస్తున్న విశేష ఆదరణచూసి తట్టుకోలేక ఈ దారుణానికి పాల్పడ్డారని ముఖ్యమంత్రితో అన్నారు. ప్రజల ఆశీర్వాదం వల్లే అదృష్టవశాత్తూ ఈ దాడి నుంచి సీఎం తప్పించుకున్నారన్నారు. ఉన్నాయని నాయకులతో అన్నారు. ధైర్యంగా అడుగులు ముందుకేద్దామన్నారు. కార్పొరేషన్, హజ్ కమిటీ మాజీ ఛైర్మన్ అహ్మద్ హుస్సేన్, టిడిపి అధికార ప్రతినిధి ముస్తఫా మోమిన్, కర్నూలు జిల్లా తాలిమీ బోర్డు అధ్యక్షులు ముఫ్తీ నూర్ మహ్మద్, మహ్మద్ ఇలియాస్ వైసిపిలో చేరారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి (వైసిపి) వారిని స్వాగతించగా సిఎం వైసిపి కండువాలు వేసి ఆహ్వానించారు. ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి సీనియర్ నాయకుడు చిరుమామిళ్ల శ్రీనివాసరావు (అలియాస్ బుజ్జి), నందిగామ ఎఎంసి మాజీ ఛైర్మన్ వ్వడెలి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఛైర్మన్ వై.రామారావు, గోడపాటి బూరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ కరీముల్లా, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ అధ్యక్షురాలు డాక్టర్ షేక్ హసీనా, కొమ్ము విజయరాజు చేరారు. ఎంపి కేశినేని శ్రీనివాసరావు (నాని), నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గన్నారు. పెనమలూరు నియోజకవర్గ టిడిపి నేతలు దేవినేని గౌతమ్, చలసాని పండు కుమార్తె చలసాని స్మిత, బిసివై పార్టీ నుంచి కె.ఉమావల్లియాదవ్, మాదిగ హక్కుల కమిటీ ఫౌండర్ గురివిందపల్లి చిట్టిబాబులు వైసిపిలో చేరారు. వీరిని మంత్రి జోగి రమేష్ ఆహ్వానించారు.వైసిపి శ్రేణుల సందడికేసరపల్లి నుంచి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు గన్నవరంలో వేలాది మంది ఘనస్వాగతం పలికారు. యువకులు, మహిళలు సందడి చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో గన్నవరం, ఉంగుటూరు మండలాల నుంచి వాహనాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున గన్నవరం తరలించారు. గాంధీ బమ్మ సెంటర్లో జన సందోహం కనిపించిది. ఉదయం 9.30 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమవుతుందని ప్రకటించినా 11గంటలకు జగన్ బస్సు యాత్రను ప్రారంభించారు. దుర్గాపురం, కొత్తపేట సెంటర్లలో రోడ్డుకు ఇరువైపులా జనాలు నిలబడి సందడి చేశారు. వంశీ కార్యాలయం వద్ద వందలాదిమంది జెండాలు చేతబూని నినాదాలు చేశారు. అక్కడ నుంచి గాంధీ బమ్మ సెంటర్ వరకు అడుగడుగునా జనం జేజేలు పలికారు. రోడ్డుకి నాలుగు వైపులా ఉన్న జనాన్ని చూసి అభివాదం చేసేందుకు జగన్ బస్సు పైన చుట్టూ తిరిగారు.

## గత పదేళ్ల ఎన్డీయే పాలన ట్రైలర్ మాత్రమే.. ఇంకా చేయాల్సింది చాలా ఉంది : ప్రధాని మోదీ



ఢిల్లీ:ఏప్రిల్ 15( విభారె) దేశంలో గత పదేళ్ల ఎన్డీయే పాలన పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ పదేళ్ల పాలనలో చూసింది కేవలం ట్రైలర్ మాత్రమేనని అన్నారు. ఇంకా చేయాల్సింది ముందు ముందు చాలా ఉందన్నారు. సోమవారం కేరళ రాష్ట్రంలోని కున్నంకుళం లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని పాల్గొని మాట్లాడారు. కేరళతోపాటు దేశ ప్రగతికి చేయాల్సింది చాలా ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'గత పదేళ్లలో జరిగింది కేవలం ట్రైలర్ మాత్రమే. కేరళ సహా భారత్ కోసం చేయాల్సింది ఇంకా చాలా ఉంది' అని అన్నారు.ఇక ఇదే సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ పేరును ప్రస్తావించకుండా "కాంగ్రెస్ యువరాజు' తన కుటుంబ గౌరవాన్ని కాపాడుకోలేకపోయారు. యూపీలో తన కుటుంబానికి చెందిన స్థానాన్ని కాపాడుకోలేక మౌనంగా ఉన్నారు (ఏళ్ల తరబడి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న అమేథీ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఉద్దేశిస్తూ). అయితే, కేరళ ప్రజల ప్రయోజనాల కోసం గొంతెత్తని ఆయన ఓట్లు మాత్రం అడుగుతాడు' అంటూ రాహుల్‌పై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇక ఈ ఎన్నికల్లోనూ బీజేపీ కూటమిని ఆశీర్వదించాలని ఓటర్లను మోదీ అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు.

## సార్వత్రిక ఎన్నికలు.. సచివాలయంలో తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల సమావేశం



అమరావతి ఏప్రిల్ 15 ( విభారె) త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు నిర్ణయించింది. ఈ మేరకు అంతర్రాష్ట్ర ఎన్నికల సంబంధిత అంశాలపై తెలంగాణ సచివాలయంలో సోమవారం సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో సీఎస్‌లు శాంతికుమారి, జవహర్‌రెడ్డి, డీజీపీ రవిగుప్తా పాల్గొనగా.. వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ మే 13న జరిగే పోలింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని కలెక్టర్లు, వివిధశాఖ ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాలు నిర్వమించినట్లు తెలిపారు.అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ వస్తువుల రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామన్నారు. శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని.. ఇదే వాతావరణాన్ని పోలింగ్ వరకు పకడ్బందీగా కొనసాగించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య సీఎస్‌ల సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు. గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు రవాణా కాకుండా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.తెలంగాణ తరపున పోలీస్ శాఖ ద్వారా 36 అంతరాష్ట్ర చెక్ పోస్టులు, ఆటవీ శాఖకు సంబంధించి మూడు అంతరాష్ట్ర చెక్ పోస్టులు, ఎక్సైజ్‌శాఖ ఎనిమిది, 224 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, వాణిజ్యపన్నుల శాఖ ద్వారా ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24గంటల పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణలో తీవ్రవాద ప్రాబల్యం లేదని, ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరుగకుండా ఇరు రాష్ట్రాలు పోలీసులు, కేంద్ర బలగాలు పటిష్టమైన సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నందున.. ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు.




**అరెస్ట్‌పై విచారణ 29కి వాయిదా**
**సమాదానం ఇవ్వాలంటూ ఇడికి నోటీసులు**

న్యూఢిల్లీ,ఏప్రిల్15, ( విభారె) ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులోనూ నిరాశే ఎదురైంది. కేజ్రీవాల్‌కు అత్యున్నత న్యాయస్థానంలోనూ ఊరట లభించలేదు. ఈడీ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. ఈ అరెస్ట్ ఛాలెంజ్ పిటిషన్‌ను ఏప్రిల్ 29న విచారిస్తానని జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం స్పష్టం చేసింది. అదే సమయంలో కేజీవ్రాల్ అరెస్ట్‌పై ఈడీకి నోటిసులు జారీ చేసింది సుప్రీం ధర్మాసనం. ఏప్రిల్ 24వ తేదీ లోపు సమాధానం చెప్పాలని ఈడీని ఆదేశించింది సుప్రీంకోర్టు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేయాలంది. ఈడీ అరెస్ట్, ట్రయిల్ కోర్టు కస్టడీని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేజీవ్రాల్ పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు.. కూడా తన అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ రౌస్ అవెన్యూ కోర్టులో, ఢిల్లీ హైకోర్టులో సైతం పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను రెండు కోర్టులు తిరస్కరించగా.. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం విచారణను తరువాత చేస్తానని చెప్పింది. దీంతో కేజీవ్రాల్ మరికొన్ని రోజులు జైల్లో ఉండక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదిలాఉంటే.. ఢిల్లీ లిక్కర్ కేసులో సీఎం కేజ్రివాల్‌కు ఏప్రిల్ 23వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించింది రౌస్ అవెన్యూ కోర్టు. కేజీవ్రాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. దీంతో ఆయన్ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు. ల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కి నోటీసులు జారీ చేసింది. అయితే కేజీవ్రాల్‌కు మధ్యంతర ఉపశమనం లభించలేదు. కేజీవ్రాల్ పిటిషన్‌పై తక్షణ విచారణకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 24న నోటీసులపై సమాధానమిస్తామని ఇడి తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఎఎస్‌జి ఎస్.వి. రాజులు కోర్టుకు తెలిపారు. లిక్కర్ స్కామ్‌కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజీవ్రాల్ అరెస్టును ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. ఇడి అరెస్టు చట్టవ్యతిరేకం కాదని జస్టిస్ స్వర్ణకాంత పేర్కొన్నారు. దీంతో తన అరెస్టును సవాలు చేస్తూ కేజీవ్రాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న ఇడి అధికారులు కేజీవ్రాల్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయనకు 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఆ కస్టడీ కూడా నేటితో ముగియనుండటంతో కేజీవ్రాల్‌ను నేడు కోర్టులో హాజరుపర్చనున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు అలెర్ట్

**మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ**

విజయవాడ, ఏప్రిల్ 15 ( విభారె) ,పీలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు వివరాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల థియరీ పరీక్షలు రాయదల్చినవారు రూ.550 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే పరీక్ష ఫీజు రూ.550తోపాటు ఒక్కో పేపర్‌కు రూ.160 చొప్పున అదనంగా చెల్లించాలని బోర్డు పేర్కొంది. అదేవిధంగా బ్రిడ్జికోర్సు పేపర్లు రాసేందుకు రూ.150 చెల్లించాలని సూచించింది. ఇక ప్రాక్టికల్స్ పరీక్ష ఫీజును రూ.250గా నిర్ణయించారు. పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు హాజరుకావాల్సినవారు ఈ మేరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఏప్రిల్ 18 నుంచి 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. ఇక జవాబు పత్రాల రీవెరిఫికేషన్‌కు రూ.1,300, రీకౌంటింగ్‌కు రూ.260 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24 నుంచి జూన్ 1 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ప్రతిరోజు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్‌లో ఫెయిల్ అయినా విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు, విద్యార్థులు ఏదైనా సబ్జెక్టుల్లో మార్కులు తక్కువగా వస్తే ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసుకోవచ్చు.

# సంపాదకీయం

మంగళవారం 16-04-2024

## ఎన్నికలను ముంచెత్తుతున్న ఫేక్...

భారత అత్యున్నత ప్రజాస్వామ్యం అని ఎందుకు అంటామంటే ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ జరుగుతుందనే. భారత ప్రజాస్వామ్యానికి ఎన్ని రకాల అవలక్షణాలు ఉన్నా ప్రజల చైతన్యంతో ఎప్పటికప్పుడు మన గలుగుతూనే ఉంది. అయితే ఇప్పుడు అతి పెద్ద సవాల్ ఫేక్ న్యూస్ రూపంలో వస్తోంది. సోషల్ మీడియా ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా మారుతోంది. ఎలాంటి అథంటికేషన్ లేకుండా ఫేక్ న్యూస్ ప్రచారానికి ఇది ఆయుధంగా మారింది. సోషల్ మీడియా రూపం మారిపోతోంది. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల సోషల్ మీడియా సైన్యాలు.. తప్పుడు వార్తలు, మార్ఫింగ్ ఫోటోలు, నకిలీ వీడియో పోస్టులతో హల్ చల్ చేస్తున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు.. ఇప్పుడు ఏపీలోని ప్రధాన రాజకీయ పార్టీల సోషల్ మీడియా వింగ్‌లు విశ్వరూపం చూపిస్తున్నాయి. ఒకరు చేసిన దానికి మరొకరు కౌంటర్ గా ఫేక్ పోస్టులు వైరల్ చేసుకుంటున్నారు. ఇటీవల ఇది పెరిగిపోయింది. సోషల్ మీడియాలోని ఫేస్ బుక్, వాట్సాప్ , ఇతర ప్లాట్ ఫామ్స్ లో ప్రధాన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులపైన, కార్యకర్తల పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వ్యక్తిగత ఆరోపణలకు, దూషణలకు దిగుతూ తద్వారా సదరు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతలను, ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్న సందర్భాలు కూడా పెరిగిపోతున్నాయి. నిజానికి సోషల్ మీడియా అనేది సమాచార వ్యాప్తికి అత్యంత సులభమైన, తక్కువ ఖర్చు మాధ్యమం. అయితే ఇదే అది పెద్ద సవాలుగా మారింది. ఫేక్ న్యూస్ పై దేశం, సమాజం మొత్తం సీరియస్‌గా ఆలోచించాలి. ఫేక్ న్యూస్ కోసం ప్రత్యేక అకౌంట్లను, వెబ్ సైట్లను సృష్టిస్తున్నారు. అనేక పత్రికలు కూడా ఫేక్ న్యూస్ వార్తలను ప్రచురిస్తున్నాయి. మిగతా రాష్ట్రాల్లో రాజకీయం వేరు..ఎన్నికలు వస్తే చాలు ఫేక్ న్యూస్ వెల్లువలా సోషల్ మీడియాలో వెల్లువెత్తుతోంది. ప్రముఖ సంస్థల పేర్లు వాడుకుని డీప్ ఫేక్ వీడియోలు చేయడం దగ్గర్నుంచి కొత్త కొత్త టెక్నాలజీని వాడుకుని ప్రజల్లో గందరగోళం గురి చేయడం వరకూ రాజకీయ పార్టీ దేన్నీ వదులుకోవడం లేదు. దీని వల్ల ఎన్నికలు ప్రభావితం అవుతున్నాయని తెలిసినా ఒక్కటంటే ఒక్క వ్యవస్థ కూడా చర్యలు తీసుకోలేకపోతోంది. 2020లో దుబ్బాక ఉపఎన్నిక జరిగింది. రేపు పోలింగ్ జరుగుతుందనగా.. కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ఎస్‌లో చేరిపోయారని ఓ ప్రముఖ చానల్ లో వచ్చిందన్నట్లుగా ఓ వీడియో వైరల్ చేశారు. అది ఫేక్ అని అందరికీ తెలిసే సరికి పోలింగ్ అయిపోయింది . నమ్మిన వారు చాలా మంది తమ ఓటింగ్ ప్రయారిటీ మార్చుకున్నారు. ఇది ఒక్క ఉదాహరణే ఎప్పుడు .. ఎక్కడ ఎన్నికలు జరిగినా లెక్కలేన్ని ఫేక్ పోస్టులు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. తాజాగా కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో సర్వే అంటూ ఓ తెలుగు మీడియా చానల్ లో సర్వే వచ్చిందని వీడియో వైరల్ అయింది. అది డీప్ ఫేక్ వీడియోగా తేల్చి ఆ చానల్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ సంస్థలకు ఉన్న విశ్వసనీయతను ఇలా రాజకీయ పార్టీల సానుభూతిపరులు తమకు అనుకూలంగా మల్చుకునేందుకు ఏ మాత్రం ఆలోచించడం లేదు. తర్వాత ఎలాంటి పరిణామాలు చర్యలు ఉండవు కాబట్టి.. ఫేక్ అని తెలిసినా సరే ప్రజల్లోకి పంపుతున్నారు. దాన్ని నమ్మేవారు ఉంటారు. వాళ్లే టార్గెట్. రాజకీయ పార్టీలకు కావాల్సింది అదే. తాము ఏమి చెప్పినా నమ్మేవారిని రాజకీయ పార్టీలు సృష్టించుకుంటున్నాయి. ఏపీలో రాజకీయం వేరు. రేపే ఎన్నికలన్నంత హడావుడి.. ఫలితాలొచ్చిన తర్వాతి రోజు నుంచే ఉంటుంది. ఏ రాజకీయ పార్టీ కూడా విశ్రాంతి తీసుకోదు. ఆయా పార్టీల కార్యకర్తలూ అంతే. అయితే.. ఇక్కడ సమస్య అంతా... రాజకీయ పార్టీల స్ట్రాటజీ వల్లనే వస్తోంది. తమకు వ్యతిరేకం అయినా...ప్రత్యర్థి పార్టీపై అవాస్తవాలు చాలావేగంగా ప్రచారం చేసి.. ఎక్కువ మంది నమ్మేలా చేయగలిగితే..చాలని అనుకుంటున్నాయి. ఇందు కోసం.. ఆన్ లైన్ టీముల్ని నియమించుకుంటున్నాయి. ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. స్పష్టంగా కనిపిస్తున్న విషయాలను కూడా వక్రీకరిస్తున్నారు. ఫలితంగా ప్రజలు కూడా అసలు నిజలేంటో అంచనా వేసులేకపోతున్నారు. తమ రాజకీయ అభిప్రాయాలకు అనుగుణంగా ఉన్న వార్తను.. నమ్మి సంతృప్తి పడుతున్నారు. కానీ వారికి అసలు నిజం తెలియడం లేదు. తెలిసిన నమ్మలేనంతగా రాజకీయ పార్టీలు ఆ విషయానికి మసిపూసి మారేడు కాయ చేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. తెలంగాణా ఎన్నికలు 2023కి ముందు, ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కూడా ఈ టెక్నాలజీకి బలైపోయాడు. ప్రముఖ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది.సీఎం కేసీఆర్ రాజకీయ పార్టీ భారత రాష్ట్ర సమితి పై కాంగ్రెస్ సీనియర్ నాయకుడి డీప్‌ఫేక్ పరువు నష్టం కలిగించే, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు ఇందులో చూపిస్తోంది. ఆయన మాత్రమే కాదు, డీప్‌ఫేక్‌లు ఈ ఎన్నికల సీజన్‌లో ఒక పోల్ ప్రాక్టీస్‌గా మారాయి. ఎక్కడ ఎన్నికలు జరిగినా ఇవి కామన్ గా మారుతున్నాయి. సోషల్ మీడియాలో ట్రప్ గ్రూపులలో ఇలాంటి వివాదాస్పద పోస్టింగులు చేస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ, రాజకీయ, వర్గ ఘర్షణలు లేవనెత్తుతూ పరపతికి భంగం కలిగేలా వ్యవహరిస్తుంటేవాట్సాప్ గ్రూపుల అడ్మిన్లను కూడా బాధ్యులను చేస్తామనిపోలీసులు హెచ్చరిస్తున్నారు.

# కమలంలో సమన్వయ లోపం

హైదరాబాద్, ఏప్రిల్ 15, లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ ఎంపీ అభ్యర్థులు, నేతల వైఖరితో బీజేపీ హైకమాండ్ తలలు పట్టుకుంటోంది. నేతల మధ్య జరగుతున్న పోరుతో కొత్త సీట్ల సంగతి అలా పెడితే, ఉన్న సీట్లు కూడా గెలుచుకోవటం కష్టమేనని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. అగ్రనాయకులంతా వర్గాలుగా విడిపోయి, ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రత్యర్థులను ఓడించే పనిలో పడటంతో ఎన్నడూ లేని ఈ మితిమీరిన వర్గపోరు ఎటు దారి తీస్తుందో అని పార్టీ అధిష్ఠానం బెంబేలెత్తుతోంది. అమిత్ షా హెచ్చరికలనూ లెక్కచేయకుండా కొందరు నేతలు రచిస్తున్న వ్యూహాలు.. మొదటికే మోసం తేనున్నాయనే వార్తలూ వినిపిస్తున్నాయి.తెలంగాణ బీజేపీ నాయకులంతా ఇప్పుడు కొత్త, పాత నాయకులనే రెండు తరగతులుగా విడిపోయారు. పాత నాయకులంటే అనాదిగా పార్టీనే నమ్ముకుని ఉన్నవారు. వీరికి సంఘ నేపథ్యంతో బాటు జాతీయవాద భావజాలం, సామాజిక సమరసతా లక్ష్యాల వంటివాటితో బాటు గెలుపోటములతో సంబంధం లేకుండా పార్టీకి సేవలందించిన చరిత్ర ఉంది. ఇక.. కొత్త నాయకులు అంటే, వేరే పార్టీల నుంచి వలస వచ్చిన నేతలు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ వంటి పార్టీల నుంచి వచ్చినవారే. బీజేపీలో చేరిన ఈ నేతలకు అధిష్ఠానం అధిక ప్రాధాన్యం ఇవ్వటం పాతతరం నేతలకు కంటగింపుగా మారుతోంది. ఉదాహరణకు ఇటీవలి ఎన్నికల్లో నాగర్ కర్నూలు, జహీరాబాద్, వరంగల్, నల్గొండ, వరంగల్ వంటి సీట్లలో ప్రకటించిన అభ్యర్థులంతా వలస వచ్చినవారే. వీరిలో కొందరు పార్టీ మారిన మూడు రోజుల్లో టికెట్ కూడా సంపాదించగలిగారు. ఇది నచ్చని పాత నేతలు, కార్యకర్తలు వీరికి ఎన్నికల వేళ సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఇక, డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి వారూ పాతతరం నేతల దృష్టిలో నేటికీ వలస పక్షులే. ప్రచారం జోరుగా చేయాల్సిన ఈ కీలక సమయంలో పాత నేతలెవరూ వీరికి మద్దతుగా నిలవటం లేదుబీసీ నేతగా బలమైన మార్పు తీసుకొచ్చాడనే పేరున్న బండి సంజయ్‌ను తప్పించటంలోనూ ఇలాంటి రాజకీయమే గతంలో పనిచేసింది. అప్పట్లో ఆయన అవలంబించిన దూకుడును, ఒంటెత్తుపోకడగా అభివర్ణిస్తూ బీసీ నేతలే ఆయనకు అండగా నిలవలేదు. ఈ విషయంలో బీసీ వర్సెస్ నాన్ బీసీ అనే ప్రాతిపదికన తెలంగాణ బీజేపీ విడిపోయింది. కిషన్



రెడ్డి నాయకత్వంలో ఈ రాజకీయం సాగినట్లు అప్పట్లో వార్తలూ వచ్చాయి. దీనికి తోడు బండి సంజయ్, ప్రొ. లక్ష్మన్, ధర్మపురి అరవింద్ వంటి వారంతా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారే కావటంతో పెత్తనమంతా ఒకే బీసీ వర్గం చేస్తుందనే భావనా తెలంగాణ బీజేపీ నేతల్లో ఉంది. తర్వాత పార్టీలో చేరిన ఈటల రాజేందర్ వంటి ఇతర కులాల నేతలకు తగినంత గుర్తింపు రాకుండా మున్నూరు కాపు నేతలు ప్రయత్నించారనే ఆరోపణ కూడా ఉంది. దీంతో బీజేపీ సానుభూతి పరులైన ఇతర బీసీ కులాలు పార్టీకి దూరమయ్యే పరిస్థితి నెలకొంటోంది.తాజా లోక్‌సభ ఎన్నికల వేళ.. ఒకే సామాజిక వర్గానికి చెందని నేతలు తోటి నేతల ఓటమికి అంతర్గతంగా పనిచేస్తున్నారనే మాటా ప్రస్తుతం వినిపిస్తోంది. కేంద్రంలో కేంద్ర పదవి దక్కే అవకాశం వస్తే.. తమ వర్గానికి చెందిన నేతలు పోటీవస్తారనే భయంతోనే వీరు తోటి అభ్యర్థుల ఓటమికి కుట్రలు చేస్తున్నారని, కొందరు నేతలు ఇంకొక అడుగు ముందుకు వేసి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు సాయం అందిస్తున్నారనే వార్తలూ వినిపిస్తున్నాయి. మరోవైపు డబ్బు, పరపతి, వ్యాపారాలున్న నేతలకు పార్టీలో ఎక్కువ విలువ దక్కుతోందని, అనేక విషయాల్లో వారి మాటే చెల్లుబాటవుతోందని పాత తరం నేతలు లోలోపల వాపోతున్నారు. ఇలాంటి వలస నేతలు పార్టీ కష్టకాలంలో అలవోకగా తమ సొంత పార్టీలకు తిరిగెళ్లి పోతారని, కనుక ఇలాంటి కార్పొరేట్ ధోరణులు పార్టీకి చేటు చేస్తున్నాయనేది వారి వాదన.తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ సీట్లుండగా వాటిలో సగానికి పైగా వలస నేతలే టికెట్లు దక్కించుకోవటం, వారితో బాటే వారి అనుచరులూ పార్టీలో చేరి పెత్తనం చెలాయించటం కూడా ఎన్నికల వేళ కొత్త సమస్యలు తెచ్చిపెడుతోంది. దీనివల్ల పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించి, ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల ముందునుంచీ సాగుతోన్న ఎన్నికల ప్రచార కార్యక్రమాలన్నీ మూలనపడ్డాయి. ఈ విషయాలను పార్టీ ఇన్‌ఛార్జ్‌లు ఢిల్లీలోని పెద్దలకు చెప్పినా పరిస్థితిలో ఏ మార్పూలేదని, నిన్నటి దాకా అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను ఓటు బ్యాంకుగా మార్చుకోవటానికి ప్రయత్నించిన తమ పార్టీ, కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ నష్ట నివారణ చర్యలకు దిగాల్సి రావటం దురదృష్టమని ఆ పార్టీ అభిమానులు ఆక్రోశిస్తున్నారు.

## తులం బంగారం ఏమైందమ్మా ప్రియాంక గాంధీ..? సూటిగా ప్రశ్నించిన హరీశ్‌రావు

కొడంగల్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిప్పులు చెరిగారు. ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం హామీ ఏమైందంటూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. మొదటి సంతకం ఆరు గ్యారెంటీల మీదనే చేస్తామన్నారు. అసెంబ్లీలో ఆ గ్యారెంటీలకు చట్టబద్ధత కూడా చేస్తామన్నారు. కానీ ఏది జరగలేదు. ఇదే కోస్గిలో ప్రియాంక గాంధీ వచ్చి ఏం మాట్లాడారు. అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లకు కేసీఆర్ ఇచ్చే లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పారు. రేవంత్ రెడ్డి ఇవ్వకపోతే తులం బంగారం ఇచ్చే జిమ్మేదార్ నాది అన్నారు. మరి ఏమైందమ్మా ప్రియాంక గాంధీ తులం బంగారం సంగతి..? ఇప్పుడు లగ్గాల సీజన్ నడుస్తోంది. మార్చి, ఏప్రిల్‌లో ఫుల్ లగ్గాలు అయినాయి. కొడంగల్‌లో ఎవరికన్న తులం బంగారం వచ్చిందా..? మరి ఇప్పుడు




ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు. తులం బంగారం ఇస్తామన్న రేవంత్, ప్రియాంక ఎక్కడికి పోయారు..? ఇది మోసం కాదా..? అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.రెండు లక్షల రుమాఫీ ఒక్కరికైనా అయిందా..? రుణమాఫీ అయినోళ్లంతా కాంగ్రెస్‌కు ఓటేయండి.. రుణమాఫీ కానోళ్లంతా కారు గుర్తుకు ఓటేయండి. వడ్లకు బోనస్ రూ. 500 అన్నాడు. కోస్గి మార్కెట్‌లో వడ్లు రూ. 2200 లకే అమ్ముడు పోతున్నాయి. బోనస్ 500 అన్నాడు.. మరి రూ. 2700లకు కొనాలి కదా..? ముచ్చట్లతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని మోసం చేస్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే లోపే రైతుబంధు 15 వేలు ఇస్తామన్నాడు. పదిహేను వేలు ఎవరికైనా వచ్చాయా..? రైతులకు ఆరు ముచ్చట్లు చెప్పి ఒక్కటి కూడా అమలు చేయలేదు. రూ. 2 లక్షల రుణమాఫీ, బోనస్ 500, రైతుబంధు రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ. 15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, 24 గంటల కరెంట్ అన్ని మోసమే. ఒక్కటి కూడా అమలు చేయలేదు. మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిన అసవరం ఉందని హరీశ్‌రావు అన్నారు

## తెలంగాణకు వర్ష సూచన.. 10 రోజుల పాటు..

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని వార్త అందించింది. వచ్చే పది రోజుల పాటు ఎండ తీవ్రత తగ్గి.. పలు చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.తర్వాత ఎండ తీవ్రత పెరిగే సూచనలు ఉన్నట్టు స్పష్టం చేసింది.కాగా, వర్షాల కారణంగా తగ మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పడిపోయాయి. వచ్చే పది రోజులపాటు అంటే.. ఈ నెల 25 వరకు రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి 25 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అంచనా వేసింది.రాజస్థాన్ మీదుగా నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాపించాయని తెలిపింది. మరో ఐదురోజులపాటు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నది. మరోవైపు గురు, శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇక, అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం



### -సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లూ, తేదీలు సూచించారు.దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, “ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం” శీర్షికతో 2000 ఏప్రిల్-జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు “ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక” సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శింపచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

# జనసైనికులు తగ్గినట్టేనా

తిరుపతి, ఏప్రిల్ 15 తిరుపతి జనసేనలో నెలకొన్న సంక్షోభాన్ని పవన్ కల్యాణ్ దాదాపుగా సర్దుబాటు చేశారు. తిరుపతి అభ్యర్థిగా చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఖరారు చేశారు. ఆయనకు వైసీపీ టిక్కెట్ నిరాకరిస్తే జనసేనలో చేరారని.. ఆయనకు తిరుపతి టిక్కెట్ కేటాయించడం ఏమిటని కూటమిలోని అన్ని పార్టీల నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. లోకల్ నేతలను వదిలి బయట నుంచి వచ్చినవారికి టికెట్ ఇవ్వడంపై టీడీపీతోపాటు జనసేన నేతలు .. ఆయనను మార్చాల్సిందేనని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అంతే కాదు పలుమార్లు కార్యకర్తలతో కూడా సమావేశాలు నిర్వహిం చారు. నాగబాబు ఒకటికి రెండు సార్లు వారిని పిలిపించుకుని మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అంతా సద్దుమణిగిపోయిందనకున్న వ్యవహారం రగులుతూనే ఉంది. జరుగుతున్న పరిణామాలు పార్టీ అభ్యర్థి గెలుపపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో పవన్‌కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగేశారు. మంగళగిరి నుంచి శుక్రవారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న పవన్‌కల్యాణ్ ముందుగా పార్టీ నేతలతో భేటీ అయ్యారు. వారి నుంచి ఇన్‌పుట్స్ తీసుకున్నారు. ఆ తర్వాత కిరణ్ రాయల్, టీడీపీ నేత సుగుణమ్మలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పొత్తుకు దారి తీసిన పరిస్థితులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమి నేతలతంతా అరణి శ్రీనివాసులును గెలిపించాలని నేతలను కోరారు. ఈ సారి ఎన్నికల్లో భూమన గెలిస్తే తిరుపతిలో ఎవరూ ఉండలేని పరిస్థితి వస్తుందన్నారు పవన్ కల్యాణ్. తిరుపతిలో జరుగుతున్న అక్రమాలు ప్రతీ ఒక్కరికీ తెలుసని, చివరకు తిరుమల కొండకు వెళ్లే పరిస్థితి లేదన్నారు టీడీపీ– జనసేన మధ్య ఓట్ల బదలాయింపు స్మూత్‌గా జరగాలంటే.. ఎలాంటి వివాదాలు ..అభిప్రాయబేధాలు ఉండకూడదన్నారు. చంద్రబాబు తో కలిసి హాజరవుతున్న సభలకు జనం నుంచి మాంచి రెస్పాన్స్ వస్తోందని గుర్తు చేశారు. ఈ సమయంలో నేతలు కాస్త ఆలోచించాలన్నారు. గడిచిన ఐదేళ్లుగా ఎన్నిబాధలు పడ్డారో తనకు తెలుసన్నారు పవన్. ఎన్నికల్లో గెలిచిన తర్వాత అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పడంతో నేతలు కాస్త సుధీర్‌రెడ్డితోపాటు జనసేన నేత వినుతను సైతం పవన్ కూటమి అభ్యర్థులు కొన్ని చోట్ల ఈగోకు పోయి ఇతర పార్టీల నేతల్ని కలుపుకుని వెళ్లడం లేదు. ఇలాంటి వారిని కూడా కూటమి నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# అక్రమ మద్యం స్వాధీనం

రంగారెడ్డి జిల్లా,శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సంఘీ ఫామ్ హౌస్ వివాహ వేడుకలకు అనుమతులు లేకుండా మద్యాన్ని అధికారులు గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి ఎక్సైజ్ అధికారుల తనిఖీలు చేసి మద్యంను స్వాధీనం చేసుకున్నారు. సంఘీ ఫామ్ హౌస్‌లోని తనిఖీలు చేయగా కారు లో డిక్కీలో 22 ఎన్ డి పి ఎఫ్ ఎల్, సీసాలు గుర్తించారు. బ్లాక్ లేబుల్ వోడ్కా లాంటి మద్యపానం స్వాధీనంచేసుకున్నారు. నిందితులు రిషబ్ జ్యోతి ప్రేమ్ సింగ్, నరసింహలనుఅదుపులోకివిచారిస్తున్నారు.

# వివేక హత్య సెంటిమెంట్ ఫలిస్తుందా

కడప, ఏప్రిల్ 15 ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్ కుటుంబ సభ్యుల మధ్య పోటీనే ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. షర్మిల అన్నపై పోరాటంలో తగ్గకూడదని డిసైడయ్యాక.. చివరికి సెంటిమెంట్ రాజకీయాలు పండిస్తున్నారు. అన్న కోసం ప్రచారం చేయకుండా తల్లిని కూడా అమెరికా పంపించేశారు. ఇప్పుడు మరో సోదరి, వివేకా కుమార్తె సునీతతో కలిసి .. అన్యాయమైపోయిన ఆడబిడ్డమని అండగా ఉండాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు. ఈ సెంటిమెంట్ పండితే వైఎస్ఆర్‌సీపీకి ఇబ్బందిక పరిస్థితులు ఎదురవుతాయి. కౌంటర్ గా ఎవరు సమాధానం ఇచ్చినా అది ప్రజల్లో మరింత చర్చకు కారణం అవుతుంది. అదే సమయంలో ఏమీ మాట్లాడకపోతే వారు చేస్తున్న ఆరోపణలు నిజమనుకునేవారి సంఖ్య పెరుగుతుంది. ఈ అంశాన్ని రాజకీయ ఎజెండాగా మార్చాలనుకున్న షర్మిల ప్లాన్ లో వైసీపీ తప్పక భాగం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంగు చాచి అడుగుతున్నా ఆదరించండి అని షర్మిల అడుగుతున్న దృశ్యాలు కరుడుగట్టిన జగన్ అభిమానినైనా కాసేపు ఆలోచింప చేసేలా ఉన్నాయి. పులివెందులలో ప్రచారం చేస్తున్న షర్మిల, సునీత మహిళా సెంటిమెంట్ ను ప్రయోగిస్తున్నారు. తాను వైఎస్ఆర్ బిడ్డనని .. తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అన్న జగన్ రెడ్డి రోడ్డున పడేశారని నేరుగా చెబుతున్నారు. ఆడిపిల్లలు అలా రోడ్డున పడి దీనంగా తమకు అండగా ఉండాలని వేడుకుంటూంటే.. ఓటర్లకు అయ్యో పాపం అనిపించక మానదు. జగన్ పై పోరాటంలో ఎక్కడా షర్మిల ఎక్కడా తగ్గకూడదని నిర్ణయించుకున్నారు. వైఎస్ షర్మిల కడప లోక్ సభ బరిలోకి దిగారు. ఆమె ఒంటరి పోరాటం చేయాలి. పార్టీ సపోర్ట్ లేదు. తాను ఉన్న పార్టీకి క్యాడర్ లేదు. ఆర్థికపరమైన మద్దతు లభించదు. అన్ని సవాళ్లనూ ఒంటరిగా ఎదుర్కోవాలి. ఆయినా షర్మిల మొదటి అడుగు చాలా స్పష్టంగా వేశారు. ఓటింగ్ ఎజెండాను ఖరారు చేసే ప్రయత్నం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డకా... వివేకా హంతకుడిగా ఎవరికి ఓటేస్తారని ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ స్ట్రాటజీ పవర్ ఫుల్ అనుకోవచ్చు. ఈ అంశాన్నే ప్రజల్లో చర్చకు పెడితే షర్మిల ప్రయత్నం సక్సెస్ అయినట్లే. అయితే ఇందులో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కడప జిల్లా వైఎస్ కుటుంబం కంచుకోట. ఆ కుటుంబం రాజకీయాల్లో నిలదొక్కుకున్న తర్వాత మరొకరు గెలిచిన చరిత్ర లేదు. కానీ ఇప్పుడు కడప లోక్ సభ నుంచి వైఎస్ కుటుంబసభ్యులే పోటీ పడుతున్నారు. అదీ కూడా వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డలే తలపడుతున్నారు. వైసీపీ తరపున అవినాష్ రెడ్డి పోటీ చేస్తున్నా.. జగన్ పోటీ చేస్తున్నట్లే లెక్క. అంత ప్రతిష్టాత్మకంగా తీసుకునే ఆయనకు టిక్కెట్ కేటాయించారు. కాంగ్రెస్ తరపున వైఎస్ బిడ్డ షర్మిల పోటీ చేస్తున్నారు. షర్మిలకు కుటుంబపరమైన సపోర్ట్ ఉంది. కానీ వారెవరూ ధైర్యంగా ముందుకు రావడం లేదు. చివరికి సొంత తల్లి కూడా షర్మిలకు మద్దతుగా ప్రచారం చేసే పరిస్థితి లేదు. విజయలక్ష్మి చాలా కాలంగా జగన్ తో పాటు ఉండటం లేదు. షర్మిలతోపాటే ఉంటున్నారు. విజయలక్ష్మి పుట్టిన రోజు నాడు.. చివరికి జగన్ పుట్టిన రోజు కూడా ఆమె జగన్ ఇంటికి వెళ్లడం లేదు. అయితే ఎన్నికల సమయం కావడంతో.. తల్లితో ప్రచారం చేయించుకోవాలని అనుకుంటున్నారు. షర్మిల కూడా అదే ఆలోచనలో ఉన్నారు. ఒకరికి అనుకూలంగా.. మరొకరికి వ్యతిరేకంగా ప్రచారం చేయలేక అమెరికా వెళ్లిపోయారు. చాలా మంది బంధువులదీ అదే పరిస్థితి. కానీ అంతర్గతంగా ఎక్కువ మంది మద్దతు షర్మిలకే ఉంటుందని అంచనా వేస్తున్నారు. షర్మిల, సునీత చేస్తన్న ప్రచారంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వానికి ఇబ్బందికరంగా మారడంతో మేనత్త విమలారెడ్డి రంగంలోకి దిగారు. షర్మిల, సునీత .. అవినాష్ రెడ్డిని హత్య చేస్తుంటే చూశారా అని ప్రశ్నిస్తున్నారు. కుటుంబ పరువును రోడ్డు మీదకు లాగుతున్నారని ఇకనైనా నోర్మూసుకోవాలని సలహా ఇచ్చారు. అయితే విమలారెడ్డి వ్యాఖ్యలకు షర్మిల గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. కొడుకుకు జగన్ ఇచ్చిన కాంట్రాక్టులతో విమలారెడ్డికి బాగానే గిట్టుబాటు అయిందని .. అందుకే ఇలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విమలారెడ్డి స్పందనతో వివేకా హత్యకేసు విషయం మరింతగా చర్చల్లోకి వచ్చింది. రాజకీయాల్లో ప్రజాతీర్పును ఆషామాషీగా అంచనా వేయలేం. ఒకే ఒక్క అంశం ఎన్నికలను ఏకపక్షంగా మార్చేస్తుంది. కడపలో ఇప్పుడా వివేకా హత్య కేసు. వివేకాను ఎవరు హత్య చేశారో.. ఎవరు చేయించారో సీబీఐకి తెలియక పోవచ్చు కానీ సీఎం జగన్ చెప్పినట్లుగా కడప ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు కొత్తగా షర్మిల, సునీత చెప్పాల్సిన పని లేదు. ఆ విషయం వారికి కూడా తెలుసు. అందుకే.. ఓ నేరేషన్ క్రియేట్ చేసి ఎన్నికలకు వెళ్తున్నారు. షర్మిల ఎంపీ కావడం.. వైఎస్ వివేకా చివరి కోరికగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్ వివేకా హత్య ఎజెండాగానే ఎన్నికలు జరగాలని.. షర్మిల కోరుకుంటున్నారు. వైఎస్ తో అనుబంధం పులివెందుల ప్రజలకు ఎక్కువ కాబట్టి.. ఓటర్లలో మార్పు అనేది వస్తే అక్కడే తీవ్ర ప్రభావం చూపుతుంది. అదే జరిగితే.. మొదటికే మోసం వస్తుంది. మొత్తంగా షర్మిల న్యాయం చేయాలన్న దీనమైన విజ్ఞప్తులతో ప్రజల్లోకి వెళ్తే... సెంటిమెంట్ పండుతుంది. దీనికి విరుగుడుగా భారతి వేసే ప్రణాళికలు కీలకం కానున్నాయి. లేకపోతే.. రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చని షర్మిల, సునీత నిరూపించే అవకాశం ఉంది.

# మద్యం అమ్మకాలపై ఆంక్షలు

విజయవాడ, ఏప్రిల్ 15 ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల హడావుడి నడుస్తుంది. అధికార, ప్రతిపక్ష నేతలు హోరా హూరీగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఇక అధికార పార్టీ వైఎస్సాఆర్‌సీపీ ఒంటరిగానే పోరుకి సిద్ధమైంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చేసిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ 'మేమంతా సిద్ధం' అంటూ బస్సు యాత్ర మొదలు పెట్టారు సీఎం జగన్. ఈ యాత్రకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన వస్తుంది. ప్రస్తుతం ఏపీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. మందుబాబులకు బిగ్ షాక్



ఇచ్చింది ఎలక్షన్ కమిషన్. వివరాల్లోకి వెళితే..ఏపీలో ఎన్నికల నేపథ్యంలో పార్టీ ప్రచారాలు పీక్ స్టేజ్ కి వచ్చాయి. ఎన్నికల సందర్భంగా కొంతమంది నేతలు ఓటర్లను ప్రలోభ పెట్టే పనిలో ఉన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మద్యం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ రిటైల్ దుకాణాల్లో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది ఎలక్షన్ కమిషన్. ఈసీ నిబంధనలు ప్రకారం గత ఏడాది 2023 ఏప్రిల్ నాటికి ఏ షాపు ఎంత వరకు అమ్మకాలు జరిగాయో అంత మేరకే అమ్మకాలు జరపాల్సి ఉంటుందని అదేశించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది ఏప్రిల్ నాటికి నమోదైన మద్యం ఎంత మేరకు జరిగింతో దాన్ని బట్టి రిటైల్ దుకాణాల్లో అమ్మకాలు జరపాల్సి ఉంటుందని మద్యం పరిమాణాన్ని నిర్ణయిస్తున్నారు అధికారులు.ఆంధ్రప్రదేశ్ లో బేవరేజెస్ కార్పోరేషన్ డిపోల నుంచి వస్తున్న మద్యం సప్లయ్ పై ఎక్సైజ్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఎన్నికల సమయం కావడంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీ నేతలు మద్యాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.వేసవి కాలం కావడంతో బీర్లకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది.. దీంతో మద్యం రిటైల్ షాపులు ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతుంటారు. దీనిపై కొరఢా ఝులిపించేందుకు ఈసీ సిద్దమైంది. ఈ క్రమంలోనే ఎక్సైజ్ అధికారులు మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడంతో పాటు నిల్వల ఎత్తివేతపై ఆంక్షలు విధించారు. దీంతో రాత్రి ఉన్న మద్యం షాపు ఉదయం మూతపడి ఉండటంతో మందుబాబులు తలలు పట్టుకుంటున్నారు.

# వైఎస్ ఫ్యామిలీలో మహిళల వార్...

కడప, ఏప్రిల్ 15 ఏపీ ఎన్నికల్లో వైయస్ కుటుంబం హాట్ టాపిక్. సీఎం జగన్ కుటుంబంలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. పీసీసీ పగ్గాలు అందుకున్న షర్మిల సోదరుడు జగన్ ను టార్గెట్ చేశారు. ఆయన పాలన వైఫల్యాలను ఎండగడుతున్నారు. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య అంశాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అవినాష్ రెడ్డిని జగనే కాపాడుతున్నారని ఆరోపిస్తున్నారు. వివేకాను చంపించిన అవినాష్ కు మద్దతిస్తారా? న్యాయం కోసం పోరాడుతున్న తన వైపు నిలబడతారా? అంటూ షర్మిల ప్రశ్నించేసరికి వైసిపి నేతల్లో వైబ్రేషన్స్ ప్రారంభమవుతున్నాయి. ఇది కచ్చితంగా తమకు నష్టం కలిగిస్తుందని ఆందోళన పడుతున్నాయి.దీంతో జగన్ తన ఆడపడుచులను నియంత్రించేందుకు.. తన కుటుంబంలోనే మహిళలను ప్రయోగిస్తున్నారు. దీంతో కుటుంబంలో చిచ్చు మరింత పెరుగుతోంది.ఆ మధ్యన వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకునే యాత్ర అనే సినిమా తీసిన సంగతి తెలిసిందే. అందులో రాజశేఖర్ రెడ్డి చెప్పే డైలాగ్ ఒకటి ఉంటుంది. మన ఇంటికి సాయం కోసం వచ్చే ఆడపిల్లతో రాజకీయం ఏంటి? అనే డైలాగు బహుళ ప్రాచుర్యం పొందింది. అయితే అదే వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల ఎన్నికల ప్రచారంలో కొంగుచాచి న్యాయం చేయండి అని ఓటర్లను అడుగుతుండడం ఆలోచింపచేస్తోంది. ఈ నేపథ్యంలోనే జగన్, షర్మిలల మేనత్త విమలారెడ్డి మీడియా ముందుకు వచ్చారు. షర్మిల, సునీతలను తీవ్రంగా విమర్శించారు. అవినాష్ రెడ్డి అమాయకుడని వెనుకేసుకొచ్చారు. ఆయనపై నిందలు వేయవద్దని.. వైయస్ కుటుంబ పరువును బజారుకు ఈడ్చొద్దని సలహా ఇచ్చారు.అయితే విమలా రెడ్డి సడన్ ఎంట్రీ వెనుక జగన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కడప జిల్లాలో షర్మిల, సునీత ప్రచారానికి ప్రజాస్పందన పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో విజయమ్మను ప్రయోగించాలని జగన్ చూశారు. కానీ ఆమె ముందుగానే పరిస్థితిని గమనించి అమెరికా వెళ్ళిపోయారు. అందుకే తన మేనత్త విమలారెడ్డిని రంగంలోకి దించారు. ఇప్పటికే ఈమె క్రిస్టియన్ వర్గాన్ని వైసీపీలో కొనసాగించేందుకు ఆపరేషన్ ప్రారంభించారు. బ్రదర్ అనిల్ కుమార్ ద్వారా జరిగే నష్టాన్ని ముందే ఊహించిన జగన్.. విమలారెడ్డిని తెరపైకి తెచ్చారు. అందుకే ఇప్పుడు విమలారెడ్డి షర్మిలపై మాట్లాడుతున్నారు. అయితే షర్మిల ఎక్కడ వెనక్కి తగ్గలేదు. విమలా రెడ్డి తనయుడికి జగన్ కొన్ని కాంట్రాక్టులు ఇచ్చి ఆర్థికంగా బలపడేలా చేశాడని.. అందుకే తన మేనత్త జగన్ కు అనుకూలంగా మాట్లాడుతోందని ఆరోపించారు. వయసు మీద పడడం వల్ల, ఎండల వల్ల వివేక తనకు చేసిందంతా మరిచిపోయి తన మేనత్త ఇప్పుడు మరోలా మాట్లాడుతుందని షర్మిల ఎద్దేవా చేశారు. మొత్తానికైతే అయితే వైఎస్ కుటుంబంలో మహిళల మధ్య చూస్తున్న రచ్చ.. సగటు వైఎస్ అభిమానిని కలచివేస్తోంది.

# జగన్ గులకరాయి..కథ

విజయవాడ, ఏప్రిల్ 15 రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ బస్సు యాత్ర చేపడుతున్నారు. రాయలసీమలో విజయవంతంగా ఈ యాత్ర పూర్తయింది. కానీ గుంటూరు జిల్లాకు వచ్చేసరికి యాత్ర తడబడింది. రకరకాల కారణాలు చెప్పి బస్సు యాత్రను నిలిపివేశారు. అయితే విజయవాడలో అడుగుపెట్టిన బస్సు యాత్రకు చిన్నపాటి అవాంతరం ఎదురయ్యింది. ఏపీ సీఎం జగన్ పై ఎవరో గుర్తు తెలియని వ్యక్తి గులకరాయి విసిరారు. దీంతో ఆయనకు కంటి పై భాగంలో గాయమైంది. ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. చంద్రబాబు పై నెపం వేస్తూ అంబటి రాంబాబు లాంటి నేతలు రంకెలు వేయడం ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఒక అధికారపక్ష నేతను టచ్ చేస్తారా? టచ్ చేస్తే ఎలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియదా? అసలే సానుభూతికి బ్రాండ్ అంబాసిడర్ వైసిపి. అటువంటి వారిని కెలుకుతారా? అన్నది వైసీపీ నేతలకే తెలియాలి.గత ఎన్నికలకు ముందు వివేకానంద రెడ్డి హత్య, అంతకుముందు కోడి కత్తి దాడి ఘటనను ఏ స్థాయిలో వాడుకున్నారు అందరికీ తెలిసిన విషయమే. అయితే ఈ గులకరాయి దాడి ఘటన వ్యూహంగా జరిగిందా? ప్లాన్ ప్రకారం జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఇప్పట్లో ఇది బయటపడుతుందా? అంటే సమాధానం దొరకని పరిస్థితి. అయితే జగన్ పై రాయి దాడి అనగానే వైసిపి రంగంలోకి దిగింది. వైసీపీ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరికిందని భావించింది. భారీ యాక్షన్ ప్లాన్ ను రూపొందించింది. అయితే ఈ ఘటనను ప్రజలు లైట్ తీసుకున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఇది ఫ్రీ ప్లాన్ ఘటనగా నిర్ధారణకు వచ్చారు. అయితే విపక్షాల నుంచి ఆ స్థాయిలో ఎదురుదాడి కూడా ప్రారంభమైంది. ఈ కొత్త నాటకాన్ని ప్రజలు ఎవరూ నమ్మరని విపక్ష నేతలు తేల్చి చెబుతున్నారు.

# కన్ఫ్యూజన్ సింబల్స్

విజయవాడ, ఏప్రిల్ 15, కూటమి ఏర్పాటు చేయడం అంటే చేశారు. కష్టపడి మూడు పార్టీలు కలిశాయి. కానీ మూడు పార్టీలూ మూడు వేర్వేరు గుర్తులపై పోటీ చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటర్లు కన్ఫ్యూజన్ కు గురయ్యే అవకాశాలున్నాయి. గుర్తులు ఓటర్లను ఇబ్బంది పెట్టే అవకాశముందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. మూడు పార్టీలూ మూడు గుర్తులు.. జనంలోకి గుర్తును బాగానే తీసుకు పోయినా పోలింగ్ వరకూ వచ్చేసరికి ఓటరు దేనిపై వేయాలన్న దానిపై కొంత గందరగోళానికి గురవుతారన్న టెన్షన్ అభ్యర్థుల్లో ఉంది. ఎందుకంటే మూడు పార్టీల అభ్యర్థులకు మూడు గుర్తులను ఎన్నికల కమిషన్ కేటాయించనుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తున్నాయి. ఉమ్మడి ప్రచారాన్ని పెద్దగా నిర్వహించడం లేదు. బీజేపీ పది అసెంబ్లీ స్థానాల్లోనూ, ఆరు పార్లమెంటు నియోజకర్గాల్లో పోటీ చేస్తుంది. జనసేన 21 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నాయి. తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్ కాగా జనసేన గుర్తు గాజు గ్లాస్. అలాగే బీజేపీ పోటీ చేసే స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి గుర్తు కమలం ఉండనుంది. అంటే మూడు గుర్తులను ఓటరు గుర్తుంచుకోవాలి. ఏపీలో రెండు ఎన్నికలు ఒకే రోజు జరగనున్నాయి. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకేతేదీన ఎన్నికలు జరుగుతుండటంతోనే ఇప్పుడు అసలు సమస్య తలెత్తింది. పోలింగ్ కేంద్రంలో రెండు ఈవీఎంలు ఉంటాయి. ఒకటి పార్లమెంటు నియోజకవర్గానికి చెందింది కాగా, రెండోది అసెంబ్లీ స్థానానికి సంబంధించింది. అంటే రెండు ఈవీఎంలలో రెండు గుర్తులపై ఓటరు బటన్ నొక్కాల్సి ఉంటుంది. కూటమి ఏర్పాటు కావడంతో సీట్లను సర్దుబాటు చేసుకుని పోటీకి దిగడంతో ఇప్పుడు కూటమి అభ్యర్థులకు ఇబ్బందిగా మారింది. ఒకే వ్యక్తి చాలా చోట్ల రెండు గుర్తులపై ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకే గుర్తు రెండు ఈవీఎంలపై అయితే పరవాలేదు. కానీ సీట్ల సర్దుబాటు జరిగిన చోట ఎంపీ అభ్యర్థికి ఒక గుర్తు మీద, ఎమ్మెల్యే అభ్యర్థికి మరొక గుర్తు మీద బటన్ నొక్కాల్సి ఉంటుంది. ఇది కొంచెం కష్టతరమైన పనే అందుకే ఎక్కువగా క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశముందన్న అంచనాలు వినిపడుతున్నాయి.తమకు తెలియకుండానే ఓట్లు ఇన్‌వాలిడ్ అయ్యే అవకాశాలు కూడా లేకపోలేదన్న భయం అభ్యర్థుల్లో నెలకొంది. అందుకే ఓటర్ల వద్దకు గుర్తును ఈ కూటమిలోని మూడు పార్టీలు బలంగా తీసుకెళుతున్నారు. ఒకవేళ గాజుగ్లాస్‌ను ఫ్రీ సింబల్ ను చేస్తే మాత్రం మరింత క్లిష్టతరమవుతుంది. ప్రతి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు వచ్చే అవకాశముంది కాబట్టి అప్పుడు మరీ గందరగోళానికి దారితీస్తుందన్న బెదురు మాత్రం కూటమి అభ్యర్థుల్లో కనిపిస్తుంది.

# ఎవరికి లాభం...ఎవరికి నష్టం

కడప, ఏప్రిల్ 15,ఎన్నికలవేళ జగన్మోహన్ రెడ్డి లాంటి నాయకుడికి ఏదైనా జరిగితే దాని పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయి. పైగా ఏపీలో కుల రాజకీయాలు ఎక్కువ కాబట్టి ఇవి దేనికైనా దారి తీసే ప్రమాదం ఉంది.. అయితే ఈ దాడి ఎవరు చేశారు? ఎందుకు చేశారు? వారి లక్ష్యం ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రస్తుతానికి సమాధానం లభించకపోయినప్పటికీ.. దీని తర్వాత జరిగే పరిణామాల ఆధారంగానే ఏపీ రాజకీయాలు ఆధారపడి ఉంటాయి. ఒక రాజకీయ నాయకుడిని మరొక రాజకీయ నాయకుడు విమర్శిస్తే పెద్దగా ఇబ్బంది ఉండదు. పైగా ఇప్పుడు రాజకీయాలు ఏకంగా వ్యక్తిగత విషయాలు దాకా వెళ్లాయి. ఏపీలో అయితే మరీ దారుణం. కానీ భౌతిక దాడులను ఎవరూ హర్షించరు. ఎందుకంటే నచ్చినా, నచ్చకున్నా ఒక మనిషిపై ఇంకొక మనిషి భౌతిక దాడి చేయడం అనేది సహేతుకం కాదు.జగన్ పై దాడి జరిగిన నేపథ్యంలో.. దానిని ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయంగా వాడుకుంటే మాత్రం అంతకుమించిన రాజకీయ దారిద్రం మరొకటి ఉండదు. ఎందుకంటే ఏపీలో ప్రస్తుతం అధికారంలో ఉన్నది వైసిపి.. ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నది జగన్మోహన్ రెడ్డి. ఒక ముఖ్యమంత్రి కి భద్రత కల్పించలేని పోలీసులు.. సామాన్యులకు ఎలా కల్పిస్తారు? ముఖ్యమంత్రి పర్యటన సాగుతున్నప్పుడు ఆ ప్రాంతంలో కరెంటు ఎందుకు తొలగించారు? ముఖ్యమంత్రి బస చేసిన బస్సు వద్దకు ఎందుకు ఒకసారి జనాన్ని అనుమతించారు? ఇలాంటి ప్రశ్నలకు సహజంగానే సమాధానం లభించాల్సి ఉంటుంది. ఎందుకంటే బస్సు యాత్ర చేస్తున్న వ్యక్తి సామాన్యుడు కాదు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి. పైగా ఇప్పుడు ఎన్నికల కాలం.. అలాంటప్పుడు పై ప్రశ్నలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్తాయి.. ఇలాంటి సమయంలో పార్టీ శ్రేణులు సమయమనం పాటించాలి. అన్నింటికీ మించి భావోద్వేగాలు రెచ్చగొట్టకుండా అధికార పార్టీ నాయకులు నిశ్శబ్దాన్ని అనుసరించాలి.ఇక ఈ దాడి రాజకీయంగా జగన్ కు నష్టం చేకూర్చే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే గత ఎన్నికల్లో జగన్ పై కోడి కత్తి దాడి జరిగింది. ఇంతవరకు ఆ కేసు సంబంధించి విచారణ లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పైగా అదే ఎన్నికల్లో వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారు. ఇప్పుడు సహజంగానే ఈ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి కూతురు జగన్ పై విమర్శలు చేస్తున్నారు. జగన్ సొంత సోదరి షర్మిల కూడా ఆరోపణలు చేస్తున్నారు. సరే అవి వారి ఇంటి విషయాలు కాబట్టి పక్కన పెట్టినా.. శనివారం రాత్రి విజయవాడలో జరిగిన దాడి ని సానుభూతి అంశంగా జగన్ ఒకవేళ ప్రజల్లోకి తీసుకెళ్తే అది నష్టం చేకూర్చే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. " దాడి జరిగింది నిజమే. జగన్ గాయపడ్డారు. కన్ను రెప్ప పై భాగం కొంచెం వాచింది. దీని వెనుక ఎవరు ఉన్నారు? వారి లక్ష్యం ఏమిటి? అసలు ఎందుకు ఇలా చేశారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుంది.. ఆ తర్వాత అసలు విషయాలు ప్రజలకు అర్థం అవుతాయి. ఒకవేళ జగన్ బాధిత పక్షం లాగా ప్రజలకు కనిపిస్తే కచ్చితంగా ఓట్లు వేసి గెలిపిస్తారు. అదే వేరే విధంగా అనిపిస్తే అప్పుడు వారు అదే ఓటుతో బుద్ధి చెబుతారు.. అప్పటిదాకా సమయమనం అనేది చాలా ముఖ్యం" అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# పిఠాపురంపై వైసీపీ ఫోకస్

కాకినాడ, ఏప్రిల్ 15 పిఠాపురంపై వైసీపీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ముద్రగడ పద్మనాభం, వంగా గీత, పెండెం దొరబాబుతో ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పిఠాపురంలో తాజా పరిస్థితులపై చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలతో విడివిడిగా చర్చిస్తున్నారు మిథున్ రెడ్డి. సర్వేలో పార్టీ గ్రాఫ్ పెరిగిందని, విబేధాలు పక్కన పెట్టి కలిసి పని చేయాలని దిశానిర్దేశం చేశారు.పిఠాపురంపై అధికార వైసీపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి కాకినాడ జిల్లాపై దృష్టి పెట్టారు. కాకినాడ జిల్లాకు సంబంధించిన వైసీపీ అభ్యర్థులతో పాటు ఎంపీ అభ్యర్థితో కూడా సమావేశం అయ్యారు. వారితో అంతర్గతంగా చర్చలు జరిపారు.

# పోలింగ్ నిర్వహణపై దిశా నిర్దేశం

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-పోలింగ్ విధులపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు సంపూర్ణ శిక్షణ పొంది పూర్తి అవగాహన తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో పోలింగ్ విధుల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు క్లాస్ రూమ్ తరహాలో శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బనగానపల్లి నియోజకవర్గంలోని జూనియర్ కాలేజీ, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని వైపిపిఎం ఉన్నత పాఠశాలల్లో జరిగిన శిక్షణా కార్యక్రమాలకు హాజరై పోలింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పోలింగ్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణ కోసం పిఓలు, ఏపీఓలకు కేటాయించిన విధులపై పూర్తిస్థాయి శిక్షణ పొంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి చిన్న పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలు తు.చ తప్పక పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణలో పిఓలు, ఏపీఓల పాత్ర ఎంతో కీలకమన్నారు. శిక్షణా కార్యక్రమంలో అందించే ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ పొందడంతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ మాన్యువల్ ను పూర్తిగా చదివి చెక్ లిస్ట్ ప్రకారం అవగాహన తెచ్చుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 కే మాక్ పోల్ నిర్వహించాలన్నారు. మాక్ పోల్ పూర్తి అయిన వెంటనే వివి ప్యాట్ లను ఖాళీ చేయడంతో పాటు ఈవిఎంలను రీసెట్ చేసిన తరువాతనే పోలింగ్ ను ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు ఫారం 17 సి, పిఓ డైరీ, పిఓ రిపోర్ట్, పిఓ డిక్లరేషన్ లను తప్పులు లేకుండా అన్నిట్లో ఓకే విధమైన వివరాలతో నింపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# మహానంది క్షేత్రంలో 17 వ తేదిన సీత రాముల కల్యాణం

## మహానంది ఈవో చంద్రశేఖర్ రెడ్డి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15- మహానంది క్షేత్రంలో ఈనెల 17,వ తేదీ చైత్ర శుద్ధ నవమి,బుధవారం,పునర్వసు నక్షత్రయుక్త (శ్రీరామ నవమి)శుభదినాన మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరామ స్వామి వారికి పగలు 10-30నుండి12-30గంటల లోపు అభిజిత్ లగ్నంలో శ్రీసీతారకళ్యాణం లోకక్షేమార్థం వైభవంగా నిర్వహించబడుతుందని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు .మరియు సాయంత్రం 4-30 లకి మహానంది గ్రామంలో హనుమద్వాహనంపై గ్రామోత్సవం జరుపబడునని తెలిపారు . భక్తులు విశేషంగా తరలి వచ్చి శ్రీ రామానుగ్రహం పొందగలరని సూచించారు

# కొనసాగుతున్న వాలంటీర్ల రాజీనామాల పరంపర




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15- నంద్యాల పట్టణం లో వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతునే ఉన్నాయి. 41-వార్డు లో మొత్తం 24 మంది వాలంటీర్లు ఉన్నారు. సోమవారం మూకుమ్మడిగా 24 మంది రాజీనామాలు చేశారు. అలాగే మిగతా వార్డులో వాలంటీర్లు రాజీనామా పత్రాలను కమిషనర్ కు అందజేస్తునే ఉన్నారు . సోమవారం మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 48 సచివాలయలలో 1024 మంది వాలంటీర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 97 మంది వాలంటీర్ల రాజీనామా పత్రాలను ఆమోదించామని అన్నారు. ఇంకా 90 మంది వాలంటీర్ల రాజీనామా పత్రాలు అందాయని వాటిపై విచారణ జరిపి అమోదిస్తామని అన్నారు. వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తమ వ్యక్తిగత కారణాల వల్ల తప్పు కొంటున్నట్లు తెలియజేస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నడూ లేని విధంగా వాలంటీర్లు ఎన్నికల సమయంలో మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం చర్చనీయాంశం అయ్యింది

# గడ్డివాములు దగ్ధం

రుద్రవరం.ఏప్రిల్ 15 :మండలంలోని యల్లావత్తుల గ్రామంలో రూ 2 లక్షల విలువ చేసే రెండు గడ్డివాములు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు గ్రామానికి చెందిన పెద్ది హరి, పాణ్యం శీను అనే రైతులకు చెందిన పశుగ్రాసము గ్రామ సమీపంలో నిలువ ఉంచారన్నారు. విద్యుత్ ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పశుగ్రాసమంతా పూర్తిగా దగ్ధమైందన్నారు. దీంతో రైతులు తమ పశువుల కోసము నిలువ ఉంచిన పశు గ్రాసమంతా పూర్తిగా దగ్ధం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశుగ్రాసం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వము తగిన ఆర్థిక న వ హే య ం అందించాలని రైతులు కోరారు



# మరో అవకాశం ఇవ్వండి మరింత అభివృద్ధి చేసి చూపిస్తాం : నాగినిరవి సింగారెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 15 వ వార్డు గిరినాథ్ సెంటర్ 14వార్డు సరస్వతి నగర్ నందు కౌన్సిలర్స్ అనూష విమలమ్మ వార్డు ఇన్చార్జ్ లు సాయిరాం రెడ్డి, సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సతీమణి నాగినిరవి సింగారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో ఎన్నడు జరగనంత అభివృద్ధి వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి చేశారని గతంలో తెలుగుదేశం నాయకులు పదవుల కోసం ఆరాటపడడం తప్ప ప్రజలకు మంచి చేసింది ఏమీ లేదని గెలిచిన రెండు సంవత్సరాల పాటు కరోనా ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వాలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పంపించి వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వ్యాక్సిన్ అందించారు మూడు సంవత్సరాలలో ఎన్నడు జగడంత అభివృద్ధి నంద్యాలలో జరిగింది అని చెప్పడానికి ఎంతో సంతోషకరంగా ఉందన్నారు నంద్యాల వైసీపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి పోటీ చేయుచున్నారని వారిని మీ మంచి మనసుతో ఆశీర్వదించాలని కోరారు.

# నిర్మల దృఢ సంకల్పం, పోరాట పటిమ కు సెల్యూట్

**ఆడపిల్లలకు నిర్మల రోల్ మోడల్,స్ఫూర్తి ప్రదాత**

**ఎక్కడైనా విద్యార్థినీ విద్యార్థులు చదువును మధ్యలో ఆపేసి ఇంట్లో ఉంటే వెంటనే ఈ సంవత్సరం కళాశాలలో అడ్మిట్ చేయండి జిల్లా కలెక్టర్ డా జి.సృజన**



కర్నూలు, ఏప్రిల్ 14:- నిర్మల పోరాట యోధురాలు అని, ఆ అమ్మాయి దృఢ సంకల్పం, ఉక్కు హృదయం, పోరాట పటిమ కు సెల్యూట్ అని జిల్లా కలెక్టర్ డా జి.సృజన ప్రశంసించారు..ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన నిర్మల 10 వ తరగతిలో మంచి మార్కులు సాధించినప్పటికీ, పేదరికంతో తలిదండ్రులు చదువు మాన్పించిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్మలను ఆస్పరి మండలం కేజీబీవీ కళాశాలలో చేర్పించిన నేపథ్యంలో నిర్మల ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షల్లో 440 మార్కులకు గాను 421 మార్కులు సాధించి జిల్లాలో టాపర్ గా నిలిచిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదివారం నిర్మల ను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు.×ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం లో జిల్లాలో టాపర్ గా నిలిచిందన్నారు.. జిల్లాలో బైపీసీ ఉన్న 8 కేజీబీవీ కళాశాలల్లో ఆస్పరి మండలం కేజీబీవీ కళాశాల్లో ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న నిర్మల వార్షిక పరీక్షల్లో టాపర్ గా నిలిచిందన్నారు.. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన హనుమంతమ్మ , శ్రీనివాస్ దంపతుల కుమార్తె నిర్మల గురించి నేడు దేశం మొత్తం చర్చిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. .. ఆడపిల్లలకు నిర్మల రోల్ మోడల్,స్ఫూర్తి ప్రదాత అని కలెక్టర్ ప్రశంసించారు. ఎన్ని ప్రతిఘటన లు ఎదురైనప్పటికీ, ఉక్కు హృదయంతో, దృఢ సంకల్పంతో చదువుకోవాలన్న తన కోరికను నెరవేర్చుకుని ఉన్నత ఆశయంతో ముందుకు వెళుతోందని కలెక్టర్ కొనియాడారు... విద్య తోనే సాధికారత లభించగలదని, ఆడపిల్లలు చదువుకుని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. బేటి బచావో బేటి పడావో కింద నిర్మలకు ఇన్సెంటివ్ ఇవ్వాలని కలెక్టర్ ఇంచార్జ్ ఐసిడిఎస్ పిడి అధికారిని ఆదేశించారు...విద్యార్థిని ఖాతాలో ఇన్సెంటివ్ జ చేయడం వల్ల ఇంటర్మీడియట్ తదనంతరం వారి తల్లితండ్రుల మీద ఆర్థిక భారం లేకుండా నిర్మలకు పై చదువులు చదవడానికి ఉపయోగపడుతుందన్నారు. సమస్యల వల్ల చదువుకోలేక మధ్యలో చదువు ఆపేసిన వారు ఇంకా ఎవరైనా ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి, అలాంటి వారిని ఈ సంవత్సరం కేజీబీవీ కళాశాలలో అడ్మిషన్ చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు...నిర్మల సాధించిన ప్రగతి గురించి అందరికీ తెలిసేలా సమావేశం నిర్వహించేందుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మలను శాలువాతో సన్మానించి స్వీట్స్ అందచేశారు..హాస్టల్ ఎలా ఉంది, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా?? అని అడిగి తెలుసుకున్నారు..ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి జీవితంలో అనేక విజయాలు సాధించాలని కలెక్టర్ నిర్మలకు ఆశీస్సులు అందచేశారు.. కలెక్టర్ గారు చేసిన మేలు జీవితాంతం మర్చిపోలేను"గ్రామంలో ఉన్న జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదివి 2021- 22 సంవత్సరములో పదవ తరగతిలో 537 మార్కులు సాధించానని,తల్లి తండ్రులు ఆర్థిక సమస్య ల వల్ల చదువు వద్దని, పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారని, అయితే నాకు ఉన్నత చదువులు చదవాలనే కోరిక ఉండడంతో అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది.. ఆ విషయం పత్రికల్లో ప్రచురితమై కలెక్టర్ గారి దృష్టికి వెళ్లడం, కలెక్టర్ మేడం గారు వెంటనే స్పందించి కేజీబీవీ కళాశాల్లో నన్ను అడ్మిషన్ చేయించడం జరిగింది.. ఈరోజు ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షల్లో కేజీబీవీ కళాశాలల్లో టాపర్ గా నిలిచాను.. ఇదంతా జిల్లా కలెక్టర్ గారు తన మీద తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల జరిగింది.. కలెక్టర్ గారు చేసిన మేలు జీవితాంతం మర్చిపోలేను" అని విద్యార్థిని నిర్మల తన అభిప్రాయాన్ని వెల్లడించారు..కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, సర్వ శిక్ష అభియాన్ ఏపిసి విజయ జ్యోతి, ఇన్చార్జ్ ఐసిడిఎస్ పి డి వెంకట లక్ష్మమ్మ, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, కేజీబీవీ ప్రిన్సిపల్ శరన్ స్మైలీ, ఆదోని ఎంఈఓ -2 శ్రీనివాసులు, విద్యార్థిని తల్లి, బంధువులు తదితరులు పాల్గొన్నారు..

# నంద్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.

నంద్యాల జిల్లా తేదీ :-15-04- 2024, నంద్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా ఈరోజు(సోమవారం) చాబోలు గ్రామంలో పర్యటించడం జరిగింది. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న 9 గ్యారంటీలను ప్రజలకు వివరించారు. మాజీ ముఖ్యమంత్రి వర్యులు, మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి గారి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని.. మళ్ళీ ఆయన ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం ఆయన కుమార్తె అయిన శ్రీమతి షర్మిలమ్మ గారితోనే సాధ్యమని ఆయన అన్నారు. మనం కోరుకునే సంక్షేమం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఆవశ్యకం అని అన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190